# ఎమ్మెల్యే శ్రీదేవిపై వైఎస్సార్సీ కార్యకర్తల ఆగ్రహం

## - కార్యాలయం వద్ద ఫ్లెక్సీలు, బ్యానర్ల ధ్వంసం

## - వెలగపూడిలో గడ్డిబొమ్మ దహనం

**అమరావతి, మార్చి 24, ప్రభాతవార్త ప్రతినిధి:** తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ఉండవల్లి శ్రీదేవి కార్యాలయంపై వైకాపా కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు.. ఆమె కార్యాలయం ఎదుట ఉన్న ఫ్లెక్సీలు, బ్యానర్లను ధ్వంసం చేశారు.. దీంతో ఎమ్మెల్యేకార్యాలయం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది... ఇదిలా ఉండగా ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో నెల్లూరుజిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌తోపాటు తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ శ్రీదేవి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని వైకాపా నేతలు తీవ్రంగా ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలను ఒకింత బలపరుస్తూ ఈ నలుగురిపై పార్టీ అధిష్ఠానం సస్పెన్షన్ విధించిన సంగతి విదితమే.. ఈ నలుగురు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని గుర్తించామని, క్రాస్ ఓటింగ్‌పై అంతర్గతంగా దర్యాప్తు చేశామని మరోవైపు ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వెల్లడించారు. కాగా సజ్జల ప్రకటన చేసిన వెంటనే ఎమ్మెల్యే శ్రీదేవి కార్యాలయంపై వైకాపా శ్రేణులు దాడికి పాల్పడటం గమనార్హం. సచివాలయం పరిధిలోని వెలగపూడి గ్రామంలో తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిపై వైకాపా కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే గడ్డిబొమ్మను దహనం చేశారు. ఈసందర్భంగా వైకాపా నేతలు, కార్యకర్తలు మాట్లాడుతూ, సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీదేవి నమ్మి సీటు ఇస్తే ఆమె చివరకు దళితులనే మోసం చేసిందంటూ ఆరోపించారు.. రాష్ట్రంలోని దళితులందరూ తలదించుకునేలా వైకాపా ఎమ్మెల్యే శ్రీదేవి ప్రవర్తించారని దుయ్యబట్టారు. ఆమె తాడికొండ ప్రాంతంలో ఎక్కడికి వెళ్లినా అడ్డుకుని తీరుతాం అంటూ సవాల్ విసిరారు. ఆమె బండారం తెటతెల్లమైందని అన్నారు. ఆమె చేసిన పని రాష్ట్రంలోని దళితులందరూ సిగ్గుపడేలా చేసిందన్నారు. సిఎం పట్ల ఆమె కృతజ్ఞత లేకుండా చేసిందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను క్రాస్ ఓటింగ్ చేయలేదని, క్రాస్ ఓటింగ్ చేయాల్సిన అవసరం తనకు లేదని ఎమ్మెల్యే శ్రీదేవి వ్యాఖ్యానించారు..తనపై వస్తున్న కథనాలు అవాస్తవమని పేర్కొన్నారు. పార్టీ ఇచ్చిన కోడ్ ప్రకారమే తాను ఓటు వేయటం జరిగిందన్నారు. ఆ రోజు ఉదయమే తన కుమార్తెతో సిఎం జగన్‌ను కలిశానని, సొంత అన్నలా చూసుకుంటానని నాతో సిఎం చెప్పారన్నారు.. సిఎం జగన్ నుంచి తనకు స్పష్టమైన హామీ వచ్చిందని, క్రాస్ ఓటింగ్ చేసిందెవరో రెండు రోజుల్లో నిజానిజాలు బయటకు వస్తాయని అన్నారు.



తమకు కొన్ని విలువలు ఉన్నాయని విలువతో కూడిన రాజకీయాలకు తాను కట్టుబడి ఉన్నానని అన్నారు.. ఒక దళిత మహిళపై దుష్ప్రచారం చేయొద్దని డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు.. దళిత మహిళను కాబట్టే ఇలా చులకనగా చూస్తున్నారని ఆమె వ్యాఖ్యానించారు.. తాను అధిష్ఠానంపై అసంతృప్తితో ఉంటే నియోజకవర్గానికి ఇన్‌చార్జిని పెట్టినపుడే రాజీనామా చేయాలని, నేను సేవ చేయటానికే రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. ఆ 22 మందిని స్క్రూటినీ చేసి నిజాన్ని తేల్చాలని అన్నారు. మళ్లీ చెబుతున్నానని, తనకు క్రాస్ ఓటింగ్ చేయాల్సిన అవసరమే లేదని పేర్కొన్నారు. ఈ విషయంలో దయచేసి నా పేరును బయటకు లాగొద్దని పేర్కొన్నారు.

# దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల సెగ్మెంట్ ఆదాయం రూ.5వేల కోట్లు

## - గత మూడేళ్లతో పోల్చితే 21శాతం అధికం

**గుంతకల్లు రైల్వే, మార్చి 24 ప్రభాతవార్త** ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ ప్రయాణీకుల సెగ్మెంట్ నుంచి 5,000.81 కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జించిందని సంబంధిత అధికారులు తెలిపారు. ఇది 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఆర్జించిన రూ.4,119.44 కోట్ల రూపాయల కంటే రూ.881.37 (21శాతం) కోట్లు అధికం. కోవిడ్ మహమ్మారి అనంతరం రద్దు చేసిన ప్రయాణీకులకు సంబంధించిన మెయిల్, ఎక్స్‌ప్రెస్, పాజింజర్ రైళ్ళను వందశాతం పునరుద్ధరించిన తొలి రైల్వే జోన్‌గా దక్షిణ మధ్య రైల్వేజోన్ రికార్డు పుటల్లోకి ఎక్కిందన్నారు. ప్రయాణీకుల డిమాండు, రిజర్వేషన్ స్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిశీలించి, సమీక్షించి, వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకుల డిమాండ్ మేరకు ఆయా రైళ్ళకు శాశ్వత ప్రాతిపదికన రెండు వందల ఆదనపు బోగీలను, రోజువారి ప్రాతిపదికన మరో 10,539 బోగీలను అదనంగా జత చేయడం మూలాన 9,83,559 మంది ప్రయాణీకులను వారి వారి గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా రూ.81.28 కోట్ల రూపాయల అదనపు ఆదాయాన్ని జోన్ ఆర్జించింది. వేసవి సెలవులు, పండుగల సీజన్లలో 30.42 లక్షల మంది ప్రయాణీకులను 3,543 ప్రత్యేక రైలు సర్వీసుల ద్వారా వారి గమ్యస్థానాలకు చేర్చడం ద్వారా 219.80 కోట్ల రూపాయల ఆదాయాన్ని ఆర్జించింది. ఎనిమిది జతల ఎక్స్‌ప్రెస్ రైళ్ళను జర్మనీ దేశపు అత్యాధునిక యాంత్రిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన లింక్ హాఫ్ మెన్ భుష్ (ఎల్‌హెచ్‌బీ) బోగీలుగా మార్చడం ద్వారా అక్యూపెన్సీ సామర్థ్యాన్ని 123శాతం పెంచామని అధికారులు తెలిపారు.



గన్నవరంలో విత్తన పరిశోధనా, శిక్షణ కేంద్రం భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రులు

# గన్నవరంలో రూ.46కోట్లతో విత్తన పరిశోధనాకేంద్రం నిర్మాణం

**గన్నవరం(కృష్ణా), మార్చి 24, ప్రభాతవార్త :** రాష్ట్రంలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న విత్తన పరిశోధనా శిక్షణాకేంద్రం నిర్మాణానికి రాష్ట్ర వ్యవసాయశాఖామంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి, కృష్ణాజిల్లా ఇన్‌చార్జీ మంత్రి ఆర్‌కె.రోజాలు భూమిపూజ చేసారు. కృష్ణాజిల్లా, గన్నవరంలోని ఆర్టీసిబస్టాండ్ పక్కనే ఉన్న రాష్ట్రవిత్తనాభివృద్ధిసంస్థ ఆవరణలోని 8ఎకరాల విస్తీర్ణంలో రూ.46కోట్ల ఖర్చుతో నిర్మిస్తున్న ఈకేంద్రం నిర్మాణ పనులను శుక్రవారం ఉదయం మంత్రులు ప్రారంభించారు. ఈసందర్భంగా కాకాణి మాట్లాడుతూ జాతీయస్థాయిలో దేశంలో వారణాసిలో మాత్రమే విత్తన పరిశోధనాకేంద్రం ఉందని, మన రాష్ట్రరైతుల ప్రయోజనాల కోసం రాష్ట్రంలో తొలిసారిగా ఈకేంద్రం ఏర్పాటుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేయటం సంతోషకరమన్నారు. రైతాంగ సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రవ్యాప్తంగా రైతులకు వ్యవసాయంలో మెళకువలు, సలహాలు అందించేందుకు 10,778 ఆర్‌బికేలు, అన్ని నియోజకవర్గాల్లో అగ్రీలాబ్స్ ఏర్పాటు చేసినసంగతిని గుర్తుచేసారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలనే లక్ష్యంతో ఈకేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విత్తనాల నాణ్యతపైనే వ్యవసాయ దిగుబడులు ఆధారపడి ఉంటాయని విత్తన నాణ్యతను పెంచేందుకు ఈకేంద్రం ఉపయోగపడుతుందన్నారు. ఆర్‌బికేలలో వ్యవసాయ, మత్స్య సహాయకులకు విత్తన పరిశోధనపై శిక్షణనిస్తామన్నారు. జన్యుపరమైన డిఎన్‌ఏ టెస్ట్‌లుకూడా నిర్వహిస్తామని తెలిపారు. ఏడాది కాలంలో ఈకేంద్రం నిర్మాణం పూర్తిచేసుకుని రైతులకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. జిల్లా ఇన్‌చార్జీ మంత్రి రోజా మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేనివంశీమోహన్ అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో వ్యవసాయమిషన్ రాష్ట్రఅధ్యక్షులు యం.వి.ఎస్.నాగిరెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి గోపాలకృష్ణద్వివేది, యండి.శేఖర్‌బాబు, అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్, జిల్లా వ్యవసాయసలహామండలి చైర్మన్ జే.రాఘవరావు, పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవి, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# నెల్లూరు జిల్లా వైఎస్సార్సీలో ప్రకంపనలు

# రాష్ట్రవ్యాప్తంగా సంచలనం

**నెల్లూరు,మార్చి24 ,ప్రభాతవార్త:** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన వైసిపి అసంతృప్తి ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలపై అదిష్టానం సస్పెషన్ వేటు వేయడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. శుక్రవారం వైసిపి అదిష్టానం వీరిపై వేటు వేస్తున్నట్లు ప్రకటించడం జిల్లాలో ప్రకంపనలు సృష్టిచింది.ఒకేసారి సీనియర్ శాసనసభ్యులపై చర్యలు తీసుకోవడం నెల్లూరు జిల్లాలో సంచలనం కలిగించింది.1989తొలిదశలో అప్పటి సీనియర్ మంత్రి నల్లపురెడ్డి శ్రీనివాస్‌రెడ్డిపై ఎన్‌టిఆర్ వేటువేశారు. మళ్లీ ఇన్నేళ్ల తర్వాత నెల్లూరు జిల్లాకు చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలపై ఒకేసారి, ఒకేరోజు సస్పెషన్ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనియాంశంగా మారింది.మాజీమంత్రి కాంగ్రేస్ పార్టీలో చక్రం తిప్పిన ఆనం రామనారాయణరెడ్డికి ఈ ఘటన పెను సవాలుగా మారింది.దశాబ్ధాలు తరబడి నెల్లూరు రాజకీయాన్ని శాసించిన ఆనం కుటుంబానికి ఇది పరాబవంగా భావించారు.ఆయన సస్పెండ్‌పై ఆనం రామనారాయణరెడ్డి ఎటువంటి వాఖ్యలు చేయలేదు.2019ముందు వైసిపిలో చేరి వెంకటగిరి నుంచి గెలుపొందారు.కరోనా సమయం,జిల్లా అధికారులు తనకి ప్రాధాన్యత ఇవ్వకపోవడం బహిరంగంగా వ్యాఖ్యానించారు.మంత్రులపై కూడా ఆయన విమర్శలు చేశారు.గత రెండున్నరేళ్ల నుంచి ఆయన అడపాదడపా ప్రభుత్వంపై విమర్శలు చేయడం జరుగుతోంది.ఈ దశలో వెంకటగిరి ఇన్‌చార్జిగా నేదురమల్లి రామకుమార్‌రెడ్డిని నియమించడం జరిగింది.దీంతో ఆయన అప్పటి నుంచి అదిష్టానంతో ఢీకొట్టారు.ఏ కార్యక్రమానికి హాజరు కాలేదు.శాసనమండలి ఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థికి సహకరించారని అదిష్టానం సీరియస్‌గా భావించి పార్టీ నుండి తొలగిస్తున్నట్లు ప్రకటించింది.కాగా నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి గత మూడు నెలల నుంచి వైసిపి అదిష్టానం తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధపడ్డారు.ఆయన బహిరంగంగానే ముఖ్యమంత్రితో పాటు సజ్జల రామకృష్ణా రెడ్డిని విమర్శిస్తూ వచ్చారు.రూరల్ నియోజకవర్గ సమస్యలపై పోరాటానికి సిద్ధమైయ్యారు.అసెంబ్లీలో మాట్లాడేందుకు అవకాశం కల్పించకపోవడంతో బహిరంగ విమర్శలకు దిగారు.దీంతో అసెంబ్లీ సమావేశాల నుంచి ఆయనను సస్పెండ్ చేయడం జరిగింది.రెండు రోజుల క్రితం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన ఆత్మ ప్రమోదానుసారం మేరకు ఓటు వేస్తున్నట్లు ప్రకటించారు.ఆయన ఓటు తెలుగుదేశానికి అనుకూలంగా వేశారని అదిష్టానం శుక్రవారం చర్య తీసుకుంది.ఇక ఉదయగిరి సీనియర్ శాసనసభ్యుడు మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిపై కూడా వైసిపి అదిష్టానం సస్పెండ్ వేటు వేసింది.రెండు నెలల క్రితం ఆయనకు తెలవకుండా తనకు పోటీగా అదిష్టానం ఇన్‌చార్జిని నీయమించడం తనకు పనులు కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.సచివాలయంలో జరిగిన శాసనమండలిఎన్నికల్లో తెలుగుదేశం అభ్యర్థికి సహకరించారనే ఆరోపణతో ఆయన సస్పెండ్ కావడం జరిగింది.వైసిపి అదిష్టానం ముగ్గురు శాసనసభ్యులపై ఒకేసారి వేటువేయడం రాష్ట్ర,నెల్లూరు జిల్లాలో పెనుసంచలనం కలిగించింది.

తాను ప్రజలకోసం పని చేస్తానని ఇందుకు పోరాట మార్గమే ఉత్తమమని భావించినట్లు నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి చెప్పారు.తనను పార్టీ నుండి సస్పెండ్ చేయడం స్వాగతిస్తున్నానని ఆయన పేర్కొన్నారు.

# డాక్టర్ విజయ్‌కుమార్ హత్య కేసులో నిందితులకు జీవిత ఖైదు

**నెల్లూరు క్రైమ్,మార్చి24,ప్రభాతవార్త** శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరుజిల్లాలో 2015 సంవత్సరంలో సంచలనం సృష్టించిన డాక్టర్ విజయ్‌కుమార్ హత్య కేసులో శుక్రవారం నెల్లూరు జిల్లా మొదటి అదనపు జిలా జడ్జి సత్యవాణి ముద్దాయిలు ఐదుగురికి జీవిత ఖైదు మరియు ఒక్కొక్కరికి 5వేల రూపాయల జరిమానా విధించారు. వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు నగరంలో ప్రముఖ వైద్యులు విజయ్‌కుమార్ బాలాజీ నగర్‌లో తన ఇంటిలో మృతిచెందాడు. విషయం తెలిసిన తర్వాత కొంతమంది స్నేహితులు ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని ఆ దిశగా దర్యాప్తు చేశారు. కేసు దర్యాప్తులో ఒళ్ళు గగుర్పొంచే విషయాలు వెళ్లడయ్యాయి. కేసు నమోదు చేసుకున్న బాలాజీ నగర్ పోలీసులు కేసులో ఏడుగురు ముద్దాయిలను అరెస్టుచేసి హత్యకు ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలే ముఖ్య కారణమని నిర్ధారించి కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టులో విచారణ చేపట్టిన అనంతరం శుక్రవారం విజయ్‌కుమార్ భార్య కుమారుడు డ్రైవర్ మరో ఇద్దరికి ఈ హత్యతో సంబంధం ఉందని ప్రాసిక్యూషన్ వారు నిరూపించడంతో ముద్దాయిలకు శిక్ష ఖరారు చేశారు. మృతుని భార్య ఉషారాణి, శ్రీధర్, సుందరయ్య, గంగరాజు, పి.రాజకు జీవితఖైదు విధిస్తూ జడ్జి తీర్పుచెప్పారు. హత్య కేసును విచారణ చేయడంలో ప్రతిభ చూపించిన సిబ్బందిని, కోర్టులో విచారణ నిరూపించడంలో ప్రతిభ కనపరిచిన ప్రాసిక్యూషన్ వారిని ఎస్పీ విజయరావు ప్రత్యేకంగా అభినందించారు.

# శాస్త్ర, సాంకేతిక రంగాల పురోగతితో సులభతర అంతర్జాతీయ వ్యాపారం



జ్యోతివెలిగించి సదస్సును ప్రారంభిస్తున్న అతిథులు

## ఎఎన్‌యు విసి ప్రొఫెసర్ రాజశేఖర్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,మార్చి24, ప్రభాతవార్త:** శాస్త్ర, సాంకేతిక రంగాలలో సాధిస్తున్న పురోగతి ఫలితంగా సులభతర అంతర్జాతీయ వ్యాపారం సాధ్యమైందని ఏఎన్‌యు వీసి ప్రొఫెసర్ రాజశేఖర్ అన్నారు. వర్సిటీలోని ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఎమర్జింగ్ ట్రెండ్స్ ఇన్ గ్లోబల్ బిజినెస్ అనే అంశంపై రెండు రోజుల సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభసభకు సదస్సు డైరెక్టర్ ఆచార్య రామినేని శివరాం ప్రసాద్ అధ్యక్షత వహించి సదస్సు ఉద్దేశాలను వివరించారు. అంతర్జాతీయంగా వ్యాపార అవకాశాలకు కొదవలేదని, సరైన సమయంలో సరైన వేదిక నుండి వాటిని నిర్వహించగలగాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వీసి రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు అంతర్జాతీయంగా జరుగుతున్న మార్పులను నిరంతరం అధ్యయనం చేయాలన్నారు. ఈ తరహా సదస్సులు కొత్త విషయాలుపట్ల ఆసక్తిని పెంపొందించడానికి దోహదపడతాయన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ ఇప్పుడు ప్రతీ విషయంలోనూ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. అహ్మదాబాద్‌లోని ఐఐఎంకు చెందిన ఆచార్య నరసింహన్ రవిచంద్రన్ మాట్లాడుతూ సాంకేతికలో వచ్చిన మార్పులు ప్రపంచగతినే మార్చివేస్తున్నాయన్నారు. వినియోగదారుని అభిరుచులకు అనుగుణంగా ప్రపంచాన్ని శాసిస్తుందని, సగటు మనిషి వ్యయం ఊహించని విధంగా మారిపోతుందని అన్నారు. లక్నో ఐఐఎం ప్రొఫెసర్ ఎస్.వెంకట్ మాట్లాడుతూ అంతర్జాతీయ వ్యాపారరంగంలో సప్లయ్ చైన్‌మేనేజ్‌మెంట్ కీలక భూమిక పోషిస్తుందన్నారు. ఇంటర్నేషనల్ బిజినెస్‌ను అభ్యసించే వారు ఆధునిక సాంకేతికతను సైతం అలవర్చుకోవాలన్నారు. మిజోరం సెంట్రల్ వర్సిటీ నుంచి ఆచార్య ఎన్వీఆర్ జ్యోతికుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ వ్యాపారరంగంలో సృజనాత్మకత పెద్దపీట వేస్తుందన్నారు. ఆచార్య ఎన్‌జి.రంగా వర్సిటీ అగ్రిబిజినెస్ విభాగాధిపతి ఆచార్య సత్యగోపాల్ మాట్లాడుతూ అగ్రిబిజినెస్‌లో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. వ్యవసాయరంగంలో ఆధునీకరణ ఫలితంగా ప్రస్తుతం పలు మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. పాండిచ్చేరి వర్సిటీకి చెందిన ఆచార్య శ్రీనివాసులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో సాంకేతికత క్రియాశీలకంగా మారుతుందన్నారు. ఈ సదస్సులో విభాగం అధ్యాపకులు డా॥ప్రసన్నకుమార్, డా॥ డి.రాజశేఖర్, డా॥బి.ఆశీరత్నం, తదితరులు పాల్గొన్నారు.

# వివిపి బ్రేక్ దర్శనాల సమయం యథాతథం!

## - వేసవిసెలవుల్లో సిఫార్సులేఖలు తగ్గించాలని టిటిడి విజ్ఞప్తి

**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** కలియుగప్రత్యక్షదైవ్ ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులకోసం తిరుమలకు వస్తున్న వేలాదిమంది సామాన్యభక్తులకు శీఘ్ర,సంతృప్తికర దర్శనమ్ కల్పించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాధాన్యతనిస్తోంది. గతంలో ఉదయం 5-6గంటల మధ్యప్రాంతంలో అమలుచేసిన విఐపి బ్రేక్ దర్శనాలసమయంలో మార్పు తీసుకువచ్చారు. జనవరి నుంచి అమలవుతున్న నూతన విధానంలో ఉదయం 8గంటలకు విఐపి బ్రేక్ దర్శనాలు సమయం అనుసరించడంతో కంపార్టుమెంట్లలో రాత్రివేళ నిరీక్షించే సామాన్యభక్తులకు సుమారు 15వేల మందికి ఉదయం వేళ వెంకన్న దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. ఈ విధానంలో సామాన్యభక్తులు సంతృప్తి వ్యక్తం చేయడం, విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో మార్పుతో విఐపిలు కూడా సదభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో తిరుమలేశుని ఆలయంలో విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో మూడునెలలుగా అమలవుతున్న విధానంతో అధికశాతంమంది సామాన్యభక్తులు ఉదయం వేళ మరింత త్వరగా ఇష్టదైవాన్ని దర్శించుకునే భాగ్యం కలగడంతో సంతోషం చెందుతున్నారు. గతంలో ఆలయంలో అమలైన విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో కొంత గందరగోళంగా ఉండటం, ఏకధాటిగా మూడు,నాలుగుగంటల పాటు వివిఐపిలు,విఐపిల బ్రేక్ దర్శనాలు కొనసాగేవి. దీనివల్ల కొన్నిగంటల పాటు సామాన్యభక్తులు కంపార్టుమెంట్లలోనే వేచిఉండి అసహనం చెందారు. భక్తుల అభిప్రాయాలను పరిగణనలోనికి తీసుకున్న టిటిడి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి ,ఆలయ వర్గాలు విఐపి బ్రేక్ దర్శనాల సమయంలో మార్పుచేశారు. ఈ మార్పులు అన్ని వర్గాల భక్తుల్లో సానుకూల స్పందన రావడంతో ఇకపై పూర్తిస్థాయిలో ఈ విధానాన్నే కొనసాగించేందుకు టిటిడి అధికారులు సుముఖతతో ఉన్నారు. గతంలో అమలైన పలు రకాల విఐపి బ్రేక్ దర్శనాలన్నిటినీ టిటిడి పాలకమండలి రద్దుచేసి ప్రోటోకాల్ విఐపిలకు తప్ప మిగిలిన వారందరికీ ఒకే దర్శనం విధానం అమలవుతోంది. సోమవారం,మంగళ, బుధవారాలు ఉదయం 8గంటలకు సిఫార్సులేఖలపై వచ్చే విఐపి బ్రేక్ దర్శనాలు ప్రారంభమవుతాయి. ఆ తరువాత ప్రోటోకాల్ విఐపి భక్తులకు,తదుపరి శ్రీవాణి బ్రేక్ దర్శనాలు చేయిస్తున్నారు. ఈ బ్రేక్ దర్శనాలన్నీ కూడా ఉదయం 11.30-మధ్యాహ్నం 12గంటలలోపే పూర్తవుతున్నాయి. ఇక గురువారం ఉదయం వెంకన్నకు తిరుప్పావడ ఆర్జితసేవ, శుక్రవారం స్వామివారికి ప్రత్యేక విశేష అభిషేకం జరుగుతుంది. ఈ సేవలనంతరం విఐపి భక్తులను దర్శనాలకు అనుమతిస్తున్నారు. శుక్రవారం రోజు మాత్రం పూర్తిగా ప్రోటోకాల్ భక్తులకే బ్రేక్ దర్శనం కల్పిస్తున్నారు. మిగిలిన శని,ఆదివారాల్లో ఉదయం 9గంటలకు ప్రోటోకాల్ భక్తుల బ్రేక్ దర్శనాలు చేయిస్తున్నారు. ఆ తరువాత జనరల్ బ్రేక్ అమలవుతోంది. ఈ విధానం వల్ల ఉదయం 4గంటల నుంచి 8గంటల వరకు సుమారుగా 15వేలమంది సామాన్యభక్తులకు ఆనందనిలయంలోని మూలవిరాట్టు వేంకటేశ్వరస్వామిని మహాలఘువిధానంలో దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. ఇక రానున్న మూడునెలలు ఏప్రిల్,మే,జూన్‌లో వేసవిసెలవుల కారణంగా దేశవిదేశాల నుంచి భక్తుల తాకిడి అధికంగా ఉంటుందనే ముందుగానే ఊహించిన టిటిడి ప్రజాప్రతినిధులు, బోర్డు సభ్యులు, రాజ్యాంగపరిధిలోని ప్రముఖులు జారీచేసే సిఫార్సులేఖలు తగ్గించాలని ఏకంగా ఛైర్మన్ సుబ్బారెడ్డి విజ్ఞప్తి చేశారు. వేసవిసెలవుల్లో సామాన్యభక్తుల రద్దీకి తగ్గట్లు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

# ఒకే ప్రాంతానికి 36వేల ఇళ్లు మంజూరు

## నిరుపేదల సంక్షేమం, అభివృద్ధే సిఎం జగన్ అజెండా

## శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మదుసూదనరెడ్డి

**శ్రీకాళహస్తి,మార్చి 24 ప్రభాతవార్త:** ఒకే ప్రాంతానికి ఒకటి రెండు కాదు పదులు వందలు కాదు 36వేల ఇళ్ళను మంజూరు చేసిన ముఖ్యమంత్రి ప్రపంచ చరిత్రలో ఎక్కడైనా ఉన్నారా?అని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధియే అజెండాగా నిస్వార్థ సేవలందిస్తున్న ఏకైన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని గిన్నిస్ బుక్ రికార్డుల్లో నమోదు చేయాలని ఆయన సూచించారు.ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రగతిని ఓర్వలేక ప్రతిపక్షం గుండెలు బాదుకుంటుందని వ్యాఖ్యానించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గం పుణ్యక్షేత్రం. ఇది నిరుపేదలు నివశిస్తున్న ప్రాంతం. ఇక్కడ వ్యవసాయమే ప్రధాన జీవనోపాధి.అలాంటి నిరుపేద ప్రాంతమైన శ్రీకాళహస్తిపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దయతో 26వేల మందికి ఒకే చోట ఇంటి స్థలాలు, ఇళ్ళను మంజూరు చేసిన ఉదారస్వభావులే కాకుండా ఆయనకు పేదల పట్ల ఉన్న గుర్తింపుకు నిదర్శనం అయనే స్వయంగా వచ్చి భూమి పూజలు నిర్వహించటం అన్నారు. ఒక్క శ్రీకాళహస్తికే కాకుండా తిరుపతికి చెందిన మరో 10వేల మందికి కూడా ఇక్కడ ఇళ్ళు, ఇంటి స్థలాలు మంజూరు చేసారని బియ్యపు మధుసూధనరెడ్డి అన్నారు. అందుకే ఈ శాటిలైట్ సిటికి జె సిటి'(జగన్ సిటి) అని నామకరణం చేసామని మధుసూధనరెడ్డి వివరించారు.తనకు ఊహా తెలిసినప్పటి నుంచి ఇద్దరే రాజులు. ఒకరు శ్రీకృష్ణదేవరాయాలు, మరోకరి నేటి జగన్మోహన్‌రెడ్డి అన్నారు.ఆయన రాయలసీమను రతనాల సీమగా పరిపాలిస్తే నేటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి



ప్రజాసంక్షేమ పాలనను అందిస్తున్నారని తెలిపారు.ఏదైనా మాటల్లో కాకుండా చేతల్లో నిరుపేదల అభివృద్ధిని కంటికి కనబడేట్లు చేపట్టారన్నారు. శ్రీకాళహస్తిలో ప్రతి నిరుపేదలకు రూ.10లక్షల విలువ కల్గిన ఇంటి స్థలాన్నిఅందించి అందులో పక్కాగృహా నిర్మాణం చేపట్టారన్నారు. మరో ఐదారేళ్ళకు ఈ ఆస్తి విలువ పాతికలక్షలు అవుతుందన్నారు.

ఇది జగనన్న ఇచ్చిన ఆస్తి కదా? అని ప్రశ్నించారు. గతంలో ఎవరైనా ఇలా నిరుపేదలకు సహాయం అందించారా? అని మధుసూధనరెడ్డి ప్రశ్నించారు.నేటి ముఖ్యమంత్రి పారదర్శక పాలనకు ఐయస్‌టి బ్రాండ్ ఇవ్వాలని మధుసూధనరెడ్డి తెలిపారు.

# టిబి రహిత రాష్ట్రం దిశగా తెలంగాణ అడుగులు

## ప్రతిభ కనబరచిన రాష్ట్రానికి 4 జాతీయ అవార్డులు

## వైద్య సిబ్బందికి మంత్రి హరీశ్‌రావు అభినందనలు

**హైదరాబాద్, మార్చి 24, ప్రభాతవార్త:** టిబి రహిత రాష్ట్రంగా ఏర్పడటానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని వైద్య, ఆరోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు తెలిపారు. టీబీ నియంత్రణలో ప్రతిభ కనబరచిన తెలంగాణకు చెందిన 4 జిల్లాలకు కేంద్రం జాతీయ అవార్డులు ప్రకటించింది. ప్రపంచ టీబీ దినోత్సవం సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసిలో జరిగిన జాతీయస్థాయిలో కార్యక్రమంలో తెలంగాణ టీబీ విభాగం అధికారులు ఈ అవార్డులను అందుకున్నారు. టీబీ నిర్మూలన కార్యక్రమాల సూచికల ఆధారంగా తెలంగాణ రాష్ట్రం ప్రస్తుతం దేశంలోనే మూడవ ఉత్తమ పనితీరు కనబరుస్తున్న రాష్ట్రంగా నిలిచింది. 2015 కేసులతో పోల్చితే తెలంగాణలో టీబీ కేసుల తగ్గింపు ప్రతిలక్ష జనాభాకు గణనీయంగా తగ్గింది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రకారం తగ్గింపు లక్ష్యం 80 శాతం కాగా, 60 శాతం తగ్గించిన నిజామాబాద్‌కు బంగారుపతకం, 40 శాతం తగ్గించిన భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండలకు వెండి, 20 శాతం తగ్గించిన ఖమ్మంకు కాంస్య పతకాలు వరించాయి. కార్యక్రమంలో భాగంగా అందించిన అవార్డులను రాష్ట్ర టీబీ విభాగం జేడీ డాక్టర్ ఏ రాజేశం, నిజామాబాద్ డీఎంహెచ్‌వో సుదర్శనం, ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ శ్రీగణ, ప్లానింగ్ ఆఫీసర్ వాసు ప్రసాద్‌లు తెలంగాణ ప్రభుత్వం తరపున అందుకునానరు. రాష్ట్రంలో టీబీ వ్యాధిని నియంత్రించేందుకు తెలంగాణ ప్రభుత్వం సమగ్ర ప్రణాళిక ఏర్పాటు చేసుకొని ముందుకు వెళుతుంది. ఇందులో భాగంగా టీబీ పరీక్షల సంఖ్య భారీగా పెంచడంతోపాటు వైద్య సహాయం తక్షణమే అందించేందుకు ఏర్పాట్లు చేసింది. కుటుంబంలో ఒక్కరికి టీబీ గుర్తిస్తే మిగతా సభ్యులకు కూడా పరీక్షలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రిని అపెక్స్ టీబీ ఆసుపత్రిగా గుర్తించడంతోపాటు మల్టీడ్రగ్ థెరపీ, డ్రగ్ రెసిస్టెన్స్ టీబీ చికిత్స పొందేవారి కోసం ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నది. టీబీ నోటిఫైబుల్ డిసీజ్ కాబట్టి ప్రైవేటులో గుర్తించిన కేసులకు కూడా పూరిత్ర ఉచితంగా అన్ని రకాల వైద్య, పరీక్షలతోపాటు వైద్యం కూడా అందిస్తున్నాము. ఈ మేరకు అన్ని కార్పొరేట్, ప్రైవేటు ఆసుపత్రులతో కలిసి పనిచేస్తున్నది తెలంగాణలో ప్రత్యేకంగా టీబీ నుంచి కోలుకున్న వారిని టీబీ ఛాంపియన్స్‌గా గుర్తించి శిక్షణ ఇచ్చి, వారి ద్వారా ప్రజల్లో అవగాహన తెస్తున్నాం ఈ టీబీ ఛాంపియన్స్ ప్రత్యేక మొబైల్ యాప్ దీక్ష ద్వారా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. టీబీ నియంత్రణలో సత్తాచాటి అవార్డులు పొందిన జిల్లాలకు ఆర్థిక, వైద్యారోగ్య మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఇందుకు కృషి చేసిన వైద్యాధికారులను అభినందించారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో తెలంగాణలో 2025 నాటికి పూర్తిస్థాయిలో క్షయ వ్యాధి(టీబీ) నిర్మూలనే లక్ష్యంగా నిర్దేశించుకుని టీబీ పరీక్షలు, వైద్యం వేగవంతం చేస్తున్నట్టు తెలిపారు.

